

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 04-09-2025 | సంపుటి - 24 | సంచిక - 116 రూ : 4 | పేజీలు: 8




2లో

## ఆ కుటుంబంలో చిచ్చుపెట్టింది

# దోపిడీ సొమ్మే...

- పంపకాల్లో తేడాలొచ్చే గొడవలు
- మీ పంచాయితీలోకి మమ్మల్ని లాగకండి
- మాకు సంక్షేమ పథకాలు అమలుచేసే పని ఉంది
- కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- భద్రాద్రి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సీఎం



## గతంలో కంటే

# ఘనంగా మేడారం జాతర


2లో

- రూ.236.2 కోట్లతో మాస్టర్ ప్లాన్
- సమీక్షించిన మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్‌కుమార్

హైదరాబాద్: మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందని, ఈసారి జాతరను గతంలో కంటే ఘనంగా నిర్వహించాలని మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రూ.236.2 కోట్ల వ్యయంతో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ముగ్గురు మంత్రులు బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. మేడారం దేవాలయ ప్రాంగణం నూతన డిజైన్‌ను పరిశీలించారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని మంత్రులు అన్నారు. ఆదివాసీ సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని మేడారం పరిసరాల్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం దానిపై ముందుకెళ్తామని స్పష్టం చేశారు. జాతరకు దేశ, విదేశాల నుంచి వచ్చే తరువాయి 2లో


2లో

## ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ కు

# కవిత రాజీనామా..

### హరీశ్ రావుపై నిప్పులు చెరిగిన కవిత

- రేవంత్ కు హరీశ్ లొంగిపోయారన్న కవిత
- నాశనం చేయడమే హరీశ్ పని అని మండిపాటు
- కేసీఆర్, కేటీఆర్ లను దెబ్బతీస్తున్నారని వ్యాఖ్య
- సంతోష్ రావు వల్ల బీఆర్ఎస్ కు చెడ్డ పేరు వచ్చిందన్న కవిత
- హరీశ్ బబుల్ షూటర్ అని ఎద్దేవా

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో

# తెలంగాణ మంత్రి భేటీ

- పామాయిల్ గెలలకు టన్నుకు రూ.25 వేల మద్దతు ధర డిమాండ్
- ఇందుకోసం పామాయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని సూచన


2లో

## అద్భుతమైన పార్టీ టీడీపీ..

### అలాంటి పార్టీని దెబ్బతీశారు!



2లో

- రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
- టీడీపీ చాలామందికి అవకాశాలు కల్పించిందన్న రేవంత్ రెడ్డి
- అలాంటి పార్టీ ఈరోజు తెలంగాణలో సమస్య ఎదుర్కొంటోందన్న సీఎం
- ప్రకృతి తప్పకుండా శిక్షిస్తుందన్న రేవంత్ రెడ్డి


2లో

## బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడంపై స్పందించిన బండి సంజయ్

- కవిత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తే ఏమిటని వ్యాఖ్య
- కాళేశ్వరం అవినీతి నుండి దృష్టి మరల్చేందుకు కవిత అంశం వచ్చిందన్న సంజయ్
- ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్న

# జీఎస్టీ కౌన్సిల్ కీలక భేటీ.. ఏవి చౌక? ఏవి ప్రియం?

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 56వ జీఎస్టీ కౌన్సిల్ భేటీ
- పండగ సీజన్ ముందు వినియోగదారులకు 'దీపావళి గిఫ్ట్' ఇచ్చే యోచన
- నాలుగు శ్లాబుల స్థానంలో రెండు శ్లాబుల సరళమైన విధానంపై ప్రధానంగా చర్చ
- కార్లు, హోటళ్లు, నిత్యావసరాలు సహా పలు వస్తువుల ధరలు తగ్గే అవకాశం
- లగ్జరీ ఈవీలు, బొగ్గు, ఖరీదైన దుస్తులపై పెరగనున్న పన్ను భారం
- పొగాకు, లగ్జరీ కార్లపై 40 శాతం 'సిన్ ట్యాక్స్' విధించే ప్రతిపాదన


2లో

# జీఎస్టీ కౌన్సిల్ కీలక భేటీ.. ఏవి చౌక? ఏవి ప్రియం?

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :** పండగ సీజన్ సమీపిస్తున్న వేళ వినియోగదారులకు, వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈరోజు జరుగుతున్న 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను రేట్లపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో చెప్పినట్లుగా, ఈసారి 'దీపావళి గిఫ్ట్' రూపంలో పన్నుల తగ్గింపు ఉండవచ్చని మార్కెట్ వర్గాల్లో బలమైన అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఉన్న 5, 12, 18, 28 శాతం అనే నాలుగు అంచెల పన్ను విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కేవలం రెండు శ్లాబులతో కూడిన సరళమైన విధానాన్ని తీసుకురావడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. వస్తువులు, సేవలను 'మెరిట్', 'స్టాండర్డ్' అనే రెండు కేటగిరీలుగా విభజించి, తదనుగుణంగా కొత్త పన్ను రేట్లను నిర్ణయించే అవకాశం ఉంది. ఈ మార్పుల వల్ల సామాన్యులు వాడే పలు వస్తువుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**ఏవి చౌక కానున్నాయి?**

తాజా ప్రతిపాదనల ప్రకారం, 1200సీసీ లోపు చిన్న కార్లు, 350సీసీ లోపు మోటార్‌సైకిళ్లపై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించవచ్చు. సబ్బులు, షాంపూలు, నూనెలు వంటి నిత్యావసరాలు 18 శాతం నుంచి 5 శాతం శ్లాబులోకి మారవచ్చు. పన్నీర్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, హోటల్ గదులు, సినిమా టికెట్లపై కూడా పన్ను భారం తగ్గనుంది. క్యాన్సర్ మందులపై జీఎస్టీని పూర్తిగా మినహాయించే అవకాశం ఉంది.

**ఏవి ప్రియం కానున్నాయి?**

అయితే, కొన్ని వస్తువులు, సేవల ధరలు పెరిగే సూచనలు కూడా ఉన్నాయి. రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల మధ్య ధర ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్టీని 5 శాతం నుంచి 18 శాతానికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. రూ. 2,500 కంటే ఎక్కువ విలువైన దుస్తులు కూడా ప్రియం కానున్నాయి. మరోవైపు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, లగ్జరీ ఆటోమొబైల్స్ వంటి వాటిపై 40 శాతం 'సిన్ ట్యాక్స్' విధించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 50,000 కోట్ల ఆదాయం తగ్గినా, దేశీయంగా కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సమావేశంలో ఆమోదం పొందిన కొత్త జీఎస్టీ రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రావచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ కు కవిత రాజీనామా..

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :**బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ కు గురైన కేసీఆర్ తనయ కవిత సంచలన ప్రకటన చేశారు. ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ మేరకు తన నిర్ణయాన్ని వెలువరించారు. తన రాజీనామా లేఖలను మీడియా ముఖంగా చూపించారు. ఇదే సమయంలో మాజీ మంత్రి హరీశ్ రావుపై ఆమె నిప్పులు చెరిగారు. హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లొంగిపోయారని ఆరోపించారు. రేవంత్, హరీశ్ ఇద్దరూ ఒకే విమానంలో ఢిల్లీకి వెళ్లారని... ఆ ప్రయాణంలో రేవంత్ కాళ్లను హరీశ్ పట్టుకున్నారని చెప్పారు. ఆ ప్రయాణం తర్వాత హరీశ్ పూర్తిగా మారిపోయారని... రేవంత్ కు లొంగిపోయారని, ఆ తర్వాతే కుట్రలకు తెరలేచిందని తెలిపారు. నాశనం చేయడమే హరీశ్ రావు పని అని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ లను దెబ్బతీసి పార్టీని చేజిక్కించుకునే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. సంతోష్ రావు చేసిన పనుల వల్ల బీఆర్ఎస్ కు చెడ్డ పేరు వచ్చిందని కవిత అన్నారు. కూరలో ఉప్పు, చెప్పులో రాయి వంటి వాడు సంతోష్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ట్రబుల్ షూటర్ కాదని... బబుల్ షూటర్ అని విమర్శించారు. ఆయనే సమస్యను సృష్టించి, ఆ సమస్యను ఆయనే పరిష్కరించినట్టు బిల్డప్ ఇస్తారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడూ కేసీఆర్, కేటీఆర్ లనే టార్గెట్ చేస్తారని... హరీశ రావును ఒక్క మాట కూడా అనరని అన్నారు.

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో తెలంగాణ మంత్రి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :** తెలంగాణ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచుతోంది. ఇందులో భాగంగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా, రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులను ఆదుకునేందుకు టన్ను గెలలకు కనీస మద్దతు ధర రూ. 25,000గా ప్రకటించాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని ప్రస్తుత స్థాయి నుంచి 44 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. ఈ చర్య వల్ల దేశీయ రైతులకు గిట్టుబాటు ధర లభించి, ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. అదేవిధంగా, వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులను తగ్గించేందుకు రైతులు ఉపయోగించే యంత్ర పరికరాలు, సూక్ష్మ సేద్యం పరికరాలపై విధిస్తున్న 12 శాతం జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని తుమ్మల కోరారు. జీఎస్టీ మినహాయింపు ఇస్తే చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఊరట కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. వీటితో పాటు, పీఎండీడీకేవై పథకంలో తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలైన నారాయణపేట, ములుగు, ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను చేర్చాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ జిల్లాలను పథకంలో చేర్చడం ద్వారా అక్కడి వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత చేయూత లభిస్తుందని తెలిపారు.

## అద్భుతమైన పార్టీ టీడీపీ.. అలాంటి పార్టీని దెబ్బతీశారు!

### : రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తులో మనుగడ సాగించలేదని, పూర్తిగా కనుమరుగవడం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ విషయంలో కేసీఆర్ అనుసరించిన వైఖరే బీఆర్ఎస్ పతనానికి కారణమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. "తెలుగుదేశం పార్టీ ఒక అద్భుతమైన పార్టీ. ఎందరికో అవకాశాలు కల్పించిన పార్టీ. కొందరు చేసిన కుట్రల వల్ల ఆ పార్టీ ఈ రోజు తెలంగాణలో సమస్యలు ఎదుర్కొంటోంది. ఇన్ని దుర్మార్గాలకు పాల్పడిన మీరు (కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి) ఇక ఎలా మనుగడ సాగిస్తారు? ప్రకృతి ధర్మం అనేది ఉంటుంది. అది మిమ్మల్ని శిక్షిస్తుంది" అని అన్నారు. ఒకప్పుడు ఏ పార్టీని బతకనీయకుండా, ఎవరూ రాజకీయం చేయకూడదని అక్రమ కేసులు పెట్టిన వారు ఇప్పుడు వారిలో వారే తన్నుకు చస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారని అన్నారు. వారిని ఎవరూ కొట్టాల్సిన అవసరం లేదని, వారే ఒకరినొకరు కొట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. విపరీతంగా అవినీతి సొమ్ము పోగుబడటంతో, పంపకాల విషయంలో కుటుంబ పంచాయతీ బయటపడిందని ఆయన అన్నారు.

## అమెరికాకు మాంద్యం ముప్పు: ఆర్థిక నిపుణుడి హెచ్చరిక!

**అమెరికా, సెప్టెంబర్ 03 :** ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా మాంద్యం అంచున ఉందని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ 'మూడీస్' చీఫ్ ఎకనమిస్ట్ మార్క్ జాండి హెచ్చరించారు. గతంలో 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసిన ఆర్థికవేత్తలలో ఒకరైన జాండి తాజా విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. వివిధ రాష్ట్రాల ఆర్థిక గణాంకాలను పరిశీలించిన మీదట ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఆయన తెలిపారు. అమెరికా జీడీపీలో దాదాపు మూడో వంతు వాటా ఉన్న రాష్ట్రాలు ఇప్పటికే మాంద్యంలో ఉన్నాయని లేదా ఆ ప్రమాదంలోకి జారుకునే అంచున ఉన్నాయని జాండి తన విశ్లేషణలో పేర్కొన్నారు. మరో మూడో వంతు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉండగా, మిగిలినవి మాత్రమే వృద్ధి బాటలో ఉన్నాయని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ మాంద్యం ప్రభావం సామాన్య అమెరికన్లపై రెండు విధాలుగా పడుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు, ఆహారం, వస్తువులు, రవాణా వంటి రంగాల్లో ఉద్యోగాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతం 2.7 శాతంగా ఉన్న వార్షిక ద్రవ్యోల్బణం రేటు వచ్చే ఏడాది నాటికి 3 శాతం దాటి, 4 శాతానికి చేరువయ్యే ప్రమాదం ఉందని జాండి అంచనా వేశారు. "ధరలు ఇప్పటికే పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రజలు పట్టించుకోకుండా ఉండలేని స్థాయిలో ఈ పెరుగుదల ఉంటుంది. ప్రతిరోజూ కొనే వస్తువుల్లోనే వారికి ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన అన్నారు. వినియోగదారుల వ్యయం, ఉద్యోగాల గణాంకాలు, తయారీ రంగం పనితీరు వంటి కీలక అంశాలు ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా పయనిస్తోందనడానికి సంకేతాలని తెలిపారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు, హౌసింగ్ మార్కెట్‌లో కొనసాగుతున్న సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోతల కారణంగా ముఖ్యంగా వాషింగ్టన్ డీసీ పరిసర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని జాండి తెలిపారు. వ్యోమింగ్, మోంటానా, మిన్నెసోటా, మిసిసిపీ, కాన్సాస్, మసాచుసెట్స్ వంటి రాష్ట్రాలు మాంద్యం ప్రమాదంలో ఉన్నాయని ఆయన విశ్లేషణలో తేలింది. అయితే, దేశ జీడీపీలో ఐదో వంతు వాటా కలిగిన కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి పెద్ద రాష్ట్రాలు నిలకడగా ఉండటం వల్ల జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా కుప్పకూలలేదని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జులై నాటికి అమెరికా వినియోగదారుల వ్యయం గత ఏడాదితో పోలిస్తే ఏమాత్రం పెరగకపోవడం, 200809 సంక్షోభం తర్వాత ఇంతటి బలహీనమైన పరిస్థితిని చూడలేదని ఆయన గుర్తుచేశారు.

## ఆ కుటుంబంలో చిచ్చుపెట్టింది దోపిడీ సొమ్మే



ఖమ్మం; ఈనాడు డిజిటల్, కొత్తగూడెం; న్యూస్‌టుడే, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి: 'నూట పది నెలలు అధికారంలో ఉండి.. నెలకు రూ.1,000 కోట్లకు తగ్గకుండా రూ.లక్ష కోట్లకు పైగా దోచుకున్నారు. పంపకాల్లో తేడాలు రావటంతో ఆయన పిల్లలు కత్తులతో పొడుచుకునే పరిస్థితికి వచ్చారు. ఏం సంతోషమయ్యా.. ఆ తండ్రికి? ఇల్లు, ఫాంహౌస్, వ్యాపారం.. ఇలా అన్నీ ఇచ్చినా పిల్లలకు ప్రశాంతత, ఆనందం ఇవ్వగలిగారా? దోపిడీ సొమ్ము ఇవాళ ఆ కుటుంబంలో చిచ్చుపెట్టింది. వారు కొట్లాడుకొంటూ... వారి వెనకాల మేమున్నామని అంటున్నారు' అని పరోక్షంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పంపకాల్లో పంచాయితీ వస్తే కుటుంబ పెద్ద లేదా కులపెద్ద దగ్గరికి వెళ్లాలి. మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగకండి. భారత రాష్ట్ర సమితి అనే పాములో కాలకూట విషముంది. తమను దోచుకునే అనకొండ అని 2023 డిసెంబరులోనే ఆ కాలనాగును ప్రజలు కట్టెతో కొట్టి చంపారు. చచ్చిన పామును కొట్టాల్సిన అవసరం మాకు లేదు. మాకు సంక్షేమ పథకాలు అమలుచేసే పని ఉంది'' అని అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం అదే మండలం దామరచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ చేపడుతున్న పథకాలను చెబుతూ భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలనలోని వైఫల్యాలను ఎండగట్టారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆత్మగౌరవ పండగ బెండాలపాడులో ఇళ్ల లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూశానని, ఇది వారు నిర్వహించుకొనే పండగ మాత్రమే కాదని.. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవ పండగ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ''భారత రాష్ట్ర సమితి పాలనలో రెండు పడక గదుల ఇల్లు వస్తుందేమో.. బంధువులు, ఇతరుల ముందు గౌరవంగా బతకవచ్చని పేదలు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో వారి కల సాకారమైంది. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పేదలకు ఇళ్లు ఇచ్చి వారి ఆత్మగౌరవం నిలబెట్టిన పార్టీ కాంగ్రెస్.

### పొంగులేటి సమర్థ మంత్రి

తనకు ఫలానా శాఖ కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అడగలేదు. కొరివి దెయ్యాలను పాతరేయాలంటే 'భూభారతి' తేవాలని, అలాగే పేదలకు ఇళ్లు కట్టించాలని, అందుకు రైతు బిడ్డ ఉండాలని నిర్ణయించుకొని దిల్లీలో అధిష్ఠానాన్ని ఒప్పించి రోజుకు 18 గంటలు పనిచేసే పొంగులేటికి రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల బాధ్యతలను అప్పగించాం. కేసీఆర్ సంగతి చూడటానికి నాకు సమయం ఉండాలని, సమర్థుడైన శ్రీనన్నకు ముఖ్య శాఖలు ఇచ్చాం. అంచనా తప్పలేదు. 20 నెలల్లోనే పేదలకు న్యాయం చేశారు. 'భూభారతి' ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించారు. 4.50 లక్షల మంది పేదలకు ఎలాంటి తప్పుల్లేకుండా గృహాలు ఇస్తున్నాం. వీటిలో 2,05,297 గృహాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రాబోయే పదేళ్లలో అర్హులందరికీ సొంతిళ్లు నిర్మిస్తాం. మొత్తం 25,35,964 మంది రైతులకు రూ.25,617 కోట్ల రుణాలు మాఫీ చేశాం. ఇవన్నీ ఇందిరమ్మ రాజ్యంతో సాధ్యమయ్యాయి. చదువు ఒక్కటే మార్గం

పేదలు బాగుపడాలంటే చదువు ఒక్కటే మార్గం. అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్నాం. రూ.20 వేల కోట్లను పాఠశాలల నిర్మాణానికి వెచ్చిస్తున్నాం. వీటిల్లో చేరే వారిని ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దుతాం. పేదలు పరిపాలన బాధ్యతలు చేపట్టాలి. వైద్యులు, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి. పది మందికి సాయం చేసే స్థితికి ఎదగాలి. అందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడంపై స్పందించిన బండి సంజయ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :**బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేయడంపై కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ స్పందించారు. ఆమె బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కవిత అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గొర్రెల పంపిణీ, బర్రెల కొనుగోలు కుంభకోణాలపై సమగ్ర చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలు వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ కేసును ఎందుకు అప్పగించడం లేదని ఆయన ప్రశ్నించారు.

## గతంలో కంటే ఘనంగా మేడారం జాతర

(మొదటి పేజీ తరువాయి)

రూ.236.2 కోట్ల వ్యయంతో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ముగ్గురు మంత్రులు బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. మేడారం దేవాలయ ప్రాంగణం నూతన డిజైన్‌ను పరిశీలించారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని మంత్రులు అన్నారు. ఆదివాసీ సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని మేడారం పరిసరాల్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం దానిపై ముందుకెళ్తామని స్పష్టం చేశారు. జాతరకు దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాలని ఆదేశించారు. 'భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏఐ కెమెరాలు ఉపయోగించాలి. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల సేవల్ని ఉపయోగించుకోవాలి. జాతర పనుల్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలి' అని అధికారులకు మంత్రులు సూచించారు.

## ప్రతీ జర్నలిస్టుకు AI పరిజ్ఞానం తప్పనిసరి



**హైదరాబాద్, సెప్టెంబర్ 03 :** హైదరాబాద్‌లోని నాంపల్లి మీడియా అకాడమీ ఆడిటోరియంలో కృత్రిమ మేధలో, టూల్స్ & టెక్నిక్స్, వర్క్ షాపును తెలంగాణ మీడియా అకాడమీ, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన దాదాపు 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం రంగంలో కూడా AIని విరివిగా వాడుతున్నారని అన్నారు. అందులో భాగంగా న్యూస్ రూములు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకొని రిపోర్టింగ్‌లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చు అని ఆయన తెలిపారు. AI సాంకేతికతపై లోతైన నైపుణ్యం ఉన్న, ఇంటర్నేషనల్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి శిక్షణ నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే తెలంగాణలో జర్నలిస్టులకు ఏఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అని ఆయన అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థి లాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందని, ఏఐ మనసును భ్రమింప జేసి తప్పుడు సమాచారాన్ని వివక్ష లాంటి సమాచారాన్ని అందించే ప్రమాదం ఉందన్నారు. తన వద్ద ఉన్న ఉదాహరణల ఆధారంగా ఏఐ అవుట్ పుట్ టూల్స్ కూడా జాతి, మత, వర్గ, లింగ భేదాలు కలిగించే కంటెంట్ ను అందిస్తాయన్నారు.

# పేదోడి సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

* **దామరచర్ల బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తామని, ఎవరూ నిరాశ చెందాల్సిన పనిలేదని ఉద్ఘాటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దామరచర్లలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, గృహ ప్రవేశాలు చేసిన సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇది ఎన్నికల సభ కాదని, పేదల గూడెంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన సభ అని స్పష్టం చేశారు. పేదవాడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇందిరాగాంధీ రోటీ, కపడా ఔర్ మకాన్ నినాదం ఇచ్చారని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు సొంతింటి కల నెరవేరిందని గుర్తుచేశారు. గత కాంగ్రెస్



ప్రభుత్వమే 10 ఏళ్లలో 25 లక్షల ఇండ్లు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈసారి కూడా ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి,



ఆ హామీని నెరవేర్చుతున్నామని అన్నారు. పేదోడి సొంతింటి కలను నెరవేర్చే బాధ్యతను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అప్పగించామని, ఆయన సమర్థవంతంగా శాఖలను నిర్వహిస్తున్నారని అభినందించారు. పేదరికం మాకు ఎక్స్‌కర్షన్ కాదు, అది జీవన విధానం అని వ్యాఖ్యానించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇండ్లు ఇవ్వడంపైనే తమ దృష్టి ఉందని తెలిపారు. బీఆర్ఎస్‌ను "కాలకూట విషం ఉన్న కాలనాగు"గా అభివర్ణించి, 2023లోనే ప్రజలు దాన్ని అంతం చేశారని ఎద్దేవా చేశారు. విద్య మాత్రమే జీవితాలను మార్చగలదని, అందుకోసం 20 వేల కోట్లతో పాఠశాలల నిర్మాణం, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏటీసీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చదువుకోండి.. చదువుకు ఏం కావాలో నన్ను అడగండి... సాయం కోసం ఎదురుచూసే స్థితి నుంచి, సాయం చేసే స్థితి వరకు ఎదగాలి" అని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని, వచ్చే 10 సంవత్సరాలు ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ లకు మున్సిపాలిటీలో ఉద్యోగం కల్పించండి

* **కమిషనర్ కి వినతి**



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 03: సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలము ఇటీవల మున్సిపాలిటీగా మారింది. దీనితో మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా నిలిపివేయడం జరిగింది.కాగా ఈ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గత 20 సంవత్సరముల నుండి వారి వారి గ్రామాలలో సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామాలు మున్సిపాలిటీ కావడంతో వారి ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి. కావున తమను నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపాలిటీలో ఏదైనా ఉద్యోగంలో సర్దుబాటు చేసి మా కుటుంబాలకు న్యాయం చేయాలని నూతనంగా వచ్చిన మున్సిపాలిటీ కమిషనర్ కు విన్నవించారు. కార్యక్షరమంలో జిన్నారం మండల గ్రామస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లు కొడకంచి శ్రీనివాస్ ఊట్ల రమేష్ సోలక్ పల్లి బాలేష్ లు ఉన్నారు.

## గణేశుడికి పూజలు నిర్వహించిన జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి



ప్రజాస్ఫూర్తి ఇల్లందు:స్థానిక ఇల్లందు కోర్ట్ ఏరియాలో నందు గల శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన గణపతిని జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో జడ్జి కీర్తి చంద్రిక రెడ్డి కి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. బుధవారం కమిటీ వారు నిర్వహించిన మహా ప్రసాదం కార్యక్రమాన్ని జడ్జి చేతుల మీదుగా ప్రారంభించి స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు వడ్డించినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు, మాజీ 24 వ వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ తార, శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ వి. లాలూ, సిహెచ్ రమేష్, టీ.శ్రీను, బిపిన్, చంద్ర శేఖర్, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దారులకు 4000 పెన్షన్ ఇస్తామని చెప్పి మోసగించింది కాంగ్రెస్ ప్రభుత్వం

* **బిఆర్ఎస్ పార్టీ నాయకులు**



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ దారులకు 4000 పెన్షన్ ఇస్తామని చెప్పి మోసగించి ఇచ్చే 2000 పెన్షన్ కూడా ఇవ్వకుండా వృద్ధులను, వికలాంగులను మానసిక ఆందోళనకు గురిచేస్తుందని మల్లాపురం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. వివరాల్లోకెళ్తే యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో వృద్ధులు పెన్షన్ కేంద్రాల వద్ద బారులు తీరారు , రాష్ట్ర ప్రభుత్వం హై వెరిఫికేషన్ పెట్టడంతో చాలామంది వృద్ధులకు ముఖం అలాగే బయోమెట్రిక్ పడకపోవడం వల్ల పెన్షన్ ఇవ్వకుండా వెనక్కి పంపి వచ్చేనెల 2 పెన్షన్ లు ఒకేసారి తీసుకోండి అని చెప్పటంతో పెన్షన్ దారులు వెనక్కి వెళ్లారు. ఈ నెల పెన్షన్ తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు పెన్షన్ కేంద్రాల వద్ద తమ రెండు నెలల పెన్షన్ తీసుకోవడానికి చాలా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 2000 రూపాయలు కి పెన్షన్ పెంచి వృద్ధులను ఆదుకున్నాడు కానీ ఇప్పుడున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ దారులకు 4000 పెన్షన్ ఇస్తామని చెప్పి మోసగించి ఇచ్చే 2000 పెన్షన్ కూడా ఇవ్వకుండా వృద్ధులను, వికలాంగులను మానసిక ఆందోళనకు గురిచేస్తుంది.వృద్ధులకు వికలాంగులకు జరగరానిది ఏమైనా జరుగుతే దానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమే అని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పల్లెపాటి మాధవులు, కారింగుల కిష్టయ్య, గోపి ఎల్లయ్య, కర్రె చంద్రశేఖర్, శిఖ నరసింహులు, మంద కృష్ణ, బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు ఒగ్గు మల్లేష్ , మోటే శేఖర్, ఓరుగంటి శ్రీధర్ ఆచారి, బరిగే రాజు, ఇండ్ల ప్రసాద్ పుచ్చుల నరసింహులు,మండిపడ్డారు




## 8 అడుగుల మట్టి వినాయకుడు – పర్యావరణ పరిరక్షణలో స్ఫూర్తి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మేదర బస్తీకి చెందిన యువకుడు కందుకూరి సంతోష్ రాజ్ ఒక వినూత్న ఆచరణకు తెరలేపాడు. మూడు రోజుల పాటు శ్రమించి 8 అడుగుల ఎత్తైన బంకమట్టి వినాయకుడి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నాడు. సంతోష్ రాజ్ ఆలోచనను స్థానిక పెద్దలు ప్రోత్సహించడంతో సహకారంతో మట్టి విగ్రహం ప్రతిష్టించబడింది. గత రెండు సంవత్సరాలుగా కూడా ఇదే విధంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాడు.

**ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం**

సంతోష్ రాజ్ మాట్లాడుతూ, ప్రతిష్టించిన చోటే నిమజ్జనం జరుపుతాం. నిమజ్జనం అనంతరం మిగిలిన బంకమట్టిని స్థానికులకు పంపిణీ చేస్తాం. పర్యావరణానికి హాని కలగకుండా ఉండడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు.

* **స్ఫూర్తిగా నిలుస్తున్న కందుకూరి సంతోష్ రాజ్**

ఈ యువకుడి ఆలోచన స్థానికులకు మాత్రమే కాకుండా, ఇతర ప్రాంతాల యువతకు కూడా స్ఫూర్తిగా మారుతోంది. మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి, భవ్యత రెండూ కలగలుస్తున్నాయి.

* **సంతోష్ రాజును సన్మానించిన ప్రకృతి ప్రేమికులు మొక్కల రాజశేఖర్**

కందుకూరి సంతోష్ రాజ్ 8 అడుగుల మట్టి విగ్రహాన్ని తయారుచేసి పూజిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ప్రకృతి ప్రేమికుడు మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షరాలు చిన్నారి నైనిక రజువా మొక్కను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికుడు మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కందుకూరి సంతోష్ రాజును పూర్తిగా తీసుకొని ప్రతి ఒక్క మండపాల్లో మట్టి విగ్రహాలను తయారు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.




## జనార్ధన్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు

* **సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వన్ దాస్ గడ్డ శాఖ వన్ సిపిఐ కార్యదర్శి సూరిమేనేని జనార్ధన్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని కొత్తగూడెం శాసనసభ్యులు ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాష అన్నారు. ఉన్నం దాస్ గడ్డ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపిల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సంస్మరణ సభలోవారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి సిపిఐ శాఖ సెక్రెటరీగా కొనసాగుతూ అనేక ఒడిదుడుకులు ఎదురైన తను నమ్మిన సిద్ధాంతం కోసం ,తానున్న ప్రాంతంలో పార్టీ నిర్మాణం కోసం కృషి చేసిన సూరీమేని జనార్ధన్ మరణం ఆయన కుటుంబానికి ,పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన నమ్మిన పార్టీ సిద్ధాంతం కోసం మనమందరం కట్టుబడి ఉండి ఆయన ఆశయాలను సాధించడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళులు అని అన్నారు. అనంతరం ఆయన స్నేహితులు సూరినేని కుటుంబానికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్డ్ చేసిన పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలిగంటి శ్రీనివాస్ ,కంచర్ల జములయ్య ఎస్కె ఫయుం జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు , మునిగడప పద్మ, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, ప్రజా సంఘాల నిర్మాణ కార్యదర్శి తూముల శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ పార్టీ నిర్మాణ బాధ్యులు మండల రాజు రామవరం బ్రాంచ్ సహాయ కార్యదర్శి గుత్తుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్స్ యూసుఫ్, బోయిన విజయ్, సత్యనారాయణ చారి, సీనియర్ నాయకులు సావటి స్వామి, ఖయ్యూం ,ఎస్కె జలీల్, మర్రి కృష్ణ ,తోగరు నరేందర్, కమల్ , జి శంకర్, గంటాడి కోటేశ్వరరావు,బాలాజీ, మహిళా సంఘం నాయకురాలు రత్నకుమారి, మైబూబి, షహీన్ ,విజయలక్ష్మి, కైసర్ ,షమీం, కుటుంబ సభ్యులు సూరి మేని రామారావు, సూరి మేని భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ తరపున పలు గణేష్ మండపాలకు సహకారం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా స్థానిక ఇల్లందు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల్లో 15 వ వార్డు శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారికి అన్న ప్రసాదం కొరకు శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారు సురేష్ రెడ్డి, కలాం తరపున ప్రతి మండపానికి 25 కేజీల బియ్యాన్ని గణనాథునికి సమర్పించడం జరిగింది. ఆర్ అండ్ ఆర్ కాలనీ 13 వ వార్డులో బజరంగ్దళ్ యూత్ కమిటీ వారికి 25 కేజీల బియ్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ లీడర్ సుమిత్ కోరి, నాగేందర్, రామ్ నివాస్, విష్ణు, విశాల్, కరణ్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలతో ప్రజల్లో ఐక్యమత్యం పెంపొందుతుంది



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గణేష్ ఉత్సవాలతో ప్రజల్లో ఐక్యమత్యం పెంపొందుతుందని శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని యాసిన్ నగర్ లో ఆ కమిటీ ఆధ్వర్యంలో స్థాపించిన గణేష్ మండపం వద్ద బుధవారం సాయంత్రం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని అన్నారు. స్వామివారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అన్నప్రసాద వితరణకు సహకరించిన దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కారింగ రాములు రమాదేవి రజిత, గాదె సత్యనారాయణ విజయ, వరికుప్పల జంగయ్య అంజమ్మ, సందగల్ల మల్లేష్ పద్మ, ఐతగోని శ్రీను జయమ్మ, కొత్త అంజి రెడ్డి మంగమ్మ,షాదీఖానా చైర్మన్ ఎస్ కే కరీం, గోధుమగడ్డ లింగారెడ్డి భవాని, వడ్లకొండ రమేష్ కవిత, చిట్టిప్రోలు నర్సింహా రేణుక, సిలివేరు వెంకటేష్, దేశట్ల యాదయ్య జంగమ్మ, ఇమ్మిడిశెట్టి కృష్ణమూర్తి సంతోషి కుమారి, చెన్నోజు మధన చారీ, మల్కాపురం తిరుమలేష్ వసంత, ఎరుకొండ హరికృష్ణ ఉమ, ఎరుకొండ శివ కృష్ణ సంధ్య,దుద్దెల శివ యాదమ్మ, ఓర్సు చంద్రయ్య సక్కు, ఎండీ మోసిన్, రియాజ్, ఐతగోని శివ, సందగల్ల పురుషోత్తం, సందగల్ల సందీప్, వరికుప్పల విష్ణు, ఓర్సు యువరాజ్, కారింగ సిద్ధూ, కారింగ మణిశంకర్, కారింగ మణి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ సర్కిల్లో వరస అక్రమ షెడ్లు

* **జిహెచ్ఎంసి అధికారులు కనుసన్నల్లో నిర్మాణాలు.....**
* **తిలాపాపం తలపెడుకుడు మన చందంగా జిహెచ్ఎంసి సిబ్బంది.**
* **జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు...**





శేరిలింగం పల్లి , ప్రజాస్ఫూర్తి :చందానగర్ సర్కిల్ పరిధిలోని అక్రమ షెడ్ల నిర్మాణం యదేచ్ఛగా సాగుతున్నాయి. జిహెచ్ఎంసి అధికారుల అండదండలు ఉండడంతో ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన డోంట్ కేర్ అంటున్నారు. ఈ మధ్యకాలంలో సర్కిల్ పరిధిలోని మియాపూర్ మక్తమహల్పేట్, మాతృశ్రీ నగర్, కె ఎస్ ఆర్ ఎంక్లేవ్, హుడా మయూరి బి.కే ఎంక్లేవ్, రెడ్డి కాలనీ ప్రాంతాలలో నిత్యం నిర్మాణం జరుగుతూనే ఉన్నాయి. వీటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీఎక్కినట్టు వ్యవహరిస్తున్నారు. ఒకవేళ అధికారులకు ముడుపులు అందకపోతే సిబ్బంది సాయంతో నేలమట్టం చేస్తారు. ముడుపులు అందితే ఎన్ని ఫిర్యాదులు అందిన కాలయాపన చేస్తారు. మరోవైపు వారికి నాయకుల సపోర్ట్ చేస్తున్నారని చెబుతారు. ఇలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ షెడ్యూల్ వల్ల జిహెచ్ఎంసి కు ఎలాంటి ఆదాయము లేకపోగా వ్యవస్థల పైన నమ్మకాల పోతున్నాయని స్థానికుల వాపోతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి ఒక న్యాయం ఇవ్వని వారికి ఒక న్యాయం అంటూ నిలదీస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై సీఎం సభలో నిరసన

**ప్లకార్డులతో నిరసన తెలిపిన ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ బృందం.**



చంద్రుగొండ /భద్రాద్రి కొత్తగూడెం, (ప్రజాస్ఫూర్తి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై తక్షణమే స్పందించాలని చంద్రుగొండ మండలం దామరచర్ల సీఎం సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టి యు డబ్ల్యూ జే ఐ జేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరిస్తుందని అన్నారు . భద్రాద్రి జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల భూమి కేటాయించి ఏళ్ళకేళ్ళు గడుస్తున్నా కోర్టు కేసుతో ముడి పెడుతున్నా రన్నారు. దీంతో జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన సొంతింటి కల నెరవేరేలా కనబడడం లేదని అందుకే సీఎం సభలో జర్నలిస్ట్ ల సమస్య తెలిసేటట్లు శాంతియుతంగా ఫ్లకార్డులతో నిరసన తెలిపామని జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. నిరసన ఆపేందుకు అక్కడికి వచ్చిన పోలీసులతో కనీసం మా ఆవేదన సీఎం రేవంత్ రెడ్డికి చేర్చాలని కోరారు. ఇప్పటికే అనేకసార్లు జిల్లా మంత్రులకు సమాచార శాఖ మంత్రివర్యులు అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సైతం విన్నవించుకున్నామని ఇప్పటికైనా వెంటనే జర్నలిస్టులకు కేటాయించిన చోట స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, జర్నలిస్టులకు అక్రిడేషన్లు సైతం వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో దుద్దుకూరు రామారావు, లక్ష్మణ్, ఈశ్వర్, శంకర్, నరసింహారావు, అశోక్, జానీ, వెంకట్, ఏర్పుల సుధాకర్, నాని, జంపన్న నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లన్న గుడి, జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఔట్, ఇంద్రన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, పలుచోట్ల వినాయకుని మండపాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి పూజలలో కార్పొరేటర్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక చవితి వేడుకలలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆశ నగర్, పీజేఆర్ నగర్, ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కాలనీ లలో కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సందర్శించి గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, మహిళలు, వినాయక కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలు

* **రూ.10వేల జరిమానా**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రం తన భార్య కనకవ్వను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడని తెలిపారు. మద్యం సేవించి గొడవకు దిగడంతోపాటు 2016 డిసెంబర్ 2న ఉదయం 6 గంటల సమయంలో భార్యను దారుణంగా కొట్టాడని, టార్చ్‌లైట్ తో దాడి చేసి గాయాలు పరిచాడని తెలిపారు. భర్త వేధింపులు భరించలేక కనకవ్వ ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, దీంతో సదిమెల రామచంద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు తెలిపారు. అనంతరం అప్పటి ఎస్ఐలు చిట్టిబాబు, ప్రవీణ్ చార్జ్‌షీట్ దాఖలు చేశారని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాధించగా, ఎస్ఐ గణేష్, సిఎంస్ ఎస్ఐ శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్‌తో పాటు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు రామచంద్రంకు ఈ శిక్ష విధించారని ఎస్ఐ వివరించారు.



## కళాశాల లో పాము కలకలం.. భయమే అసలు ప్రమాదం అవగాహన అనివార్యం: సంతోష్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వోకేషనల్ ఎలక్ట్రికల్ తరగతి గదిలోకి పాము రావడంతో ఒక్కసారిగా విద్యార్థులు ఉపాధ్యాయులు భయంతో పరుగులు తీశారు. కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్ వెంటనే ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు కొత్తగూడెం కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ జిమ్ సంతోష్ కు సమాచారం ఇవ్వగా ప్రాక్టికల్ మెటీరియల్ లో దూరిన పామును వెతికి చాకచక్యంగా పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు అనంతరం జిమ్ సంతోష్ వారికి పాము పట్ల భయం కన్నా అవగాహన మిన్న అని, పర్యావరణానికి పాముకు గల అనుబంధాన్ని పాముతో మనకు గల అవసరాన్ని, విష సర్పం కాటు కు తక్షణ చర్యలను భయమే ప్రమాదమని అవగాహన కలిగి ఉండాలని వారికి వివరించారు.

## చిన్నారులకు ఆట పాటలతో విద్యను అందించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : చిన్నారులకు ఆట పాటలతో విద్యను అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా అన్నారు. బుధవారం లాల్ గడి మలక్ పేట్ లోని హెచ్.బి.ఎల్ భగీరథ్ బాలల వికాస కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సెంటర్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతిరోజు హాజరవుతున్నారా అన్ని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన అధనపు కలెక్టర్ మాట్లాడుతూ హాజరు కాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని బడికి తీసుకురావాలని అదనపు కలెక్టరు సూచించారు.. ఆటవస్తువులతో, పరిశుభ్రతతో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న పౌష్టిక ఆహారాన్ని, గుడ్లు అందించాలన్నారు. గర్భిణీ మహిళలు ఎంత మంది వస్తున్నారని, వారికి గుడ్లు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలని అన్నారు.



అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు., పరిసర ప్రాంతాలలో ఎప్పటి కప్పుడు పారిశుద్ధ్యంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సూచించారు. పుట్టినరోజు ఉన్న విద్యార్థులకు బొమ్మలను కానుకలను అదనపు కలెక్టరు అందించారు. అంగన్ వాడీ సెంట్లలో త్రాగునీరు, టాయిలెట్స్ ఎలక్ట్రిసిటి మెయింటెనెన్స్ బాగున్నాయని అంగన్ వాడీ టీచర్లను అదనపు కలెక్టరు అభినందించారు.



## వివేకానందనగర్ డివిజన్ లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

శేరిలింగం పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వినాయక ఉత్సవ కమిటీ , మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ రోడ్ నంబర్ 11 లోని వినాయక మండపాలు దగ్గర, వీకర్ సెక్షన్ కాలనీ వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్, వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ దగ్గర, త్రీ టెంపుల్స్ దగ్గర ఆల్విన్ కాలనీ ఫేస్ 1, ఆల్విన్ కాలనీ ఫేస్ వన్ వినాయక నవోదయ యూత్ అసోసియేషన్ , రిక్షా పుల్లర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, రామకృష్ణ నగర్ మెయిన్ రోడ్ లో నవీన్, బాలకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, పలుచోట్ల ఏర్పాటు చేసినటువంటి వినాయక మండపాలను వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక వాసులతో కలిసి విఘ్నేశ్వరునికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : యాదగిరిగుట్ట పట్టణంలోని పలు వినాయక మండపాల వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీసీ కాలనిలో గల గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం పాల్గొని వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

## ఆలిండియా క్లాసికల్ కూచిపూడి డాన్స్ లో విజేతలకు ఘన సన్మానం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల కేరళలో జరిగిన ఆలిండియా క్లాసికల్ కూచిపూడి డాన్స్ జాతీయ కాంపిటీషన్లో విజేతలుగా నిలిచిన శ్రీ మానస స్కూల్ అప్ డాన్స్ విద్యార్థినిలను మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆలిండియా క్లాసికల్ కూచిపూడి డాన్స్ జాతీయ కాంపిటీషన్లో విజేతలుగా నిలిచిన హర్షిత, శ్రీవిద్య, ప్రదీక్ష, హేమ, వర్షిత, సహస్ర లను ఎంపీ ఈటెల రాజేందర్ శాలువలతో సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కూచిపూడి నాట్యాన్ని కాపాడుతూ మన రాష్ట్రానికి మంచి పేరు చేస్తున్నందుకు వారిని అభినందిస్తూ ఇంకా మరిన్ని పథకాల సాధించాలని చిన్నారులను ఆశీర్వదించారు. వీరి యొక్క గురువు ప్రణవిని పిల్లలను జాతీయస్థాయిలో పథకాలు సాధించే విధంగా తీర్చిదిద్దినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్, నాయకులు మల్లేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యలపై సీఎం సభలో నిరసన

* **ప్లకార్డులతో నిరసన తెలిపిన**
* **ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ బృందం.**



చంద్రుగొండ /భద్రాద్రి కొత్తగూడెం, (ప్రజాస్ఫూర్తి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై తక్షణమే స్పందించాలని చంద్రుగొండ మండలం దామరచర్ల సీఎం సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టి యు డబ్ల్యూ జే ఐ జేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరిస్తుందని అన్నారు . భద్రాద్రి జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల భూమి కేటాయించి ఏళ్ళకేళ్ళు గడుస్తున్నా కోర్టు కేసుతో ముడి పెడుతున్నా రన్నారు. దీంతో జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన సొంతింటి కల నెరవేరేలా కనబడడం లేదని అందుకే సీఎం సభలో జర్నలిస్ట్ ల సమస్య తెలిసేటట్లు శాంతియుతంగా ఫ్లకార్డులతో నిరసన తెలిపామని జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. నిరసన ఆపేందుకు అక్కడికి వచ్చిన పోలీసులతో కనీసం మా ఆవేదన సీఎం రేవంత్ రెడ్డికి చేర్చాలని కోరారు. ఇప్పటికే అనేకసార్లు జిల్లా మంత్రులకు సమాచార శాఖ మంత్రివర్యులు అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సైతం విన్నవించుకున్నామని ఇప్పటికైనా వెంటనే జర్నలిస్టులకు కేటాయించిన చోట స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, జర్నలిస్టులకు అక్రిడేషన్లు సైతం వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో దుద్దుకూరు రామారావు, లక్ష్మణ్, ఈశ్వర్, శంకర్, నరసింహారావు, అశోక్, జానీ, వెంకట్, ఏర్పుల సుధాకర్, నాని, జంపన్న నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ ఆర్ కాలనీలో మహా అన్నప్రసాద కార్యక్రమం

ప్రజాస్ఫూర్తి ఇల్లందు : గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా స్థానిక ఇల్లందు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీ యూత్ కమిటీ 13 వ వార్డు శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి తరపున మహా అన్న ప్రసాద కార్యక్రమం జరుపబడింది. ఈ మహా అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు. ఈ కార్యక్రమానికి మాజీ గ్రంధాలయ చైర్మన్ దిండిగల రాజేందర్. అబ్దుల్ నబీ, కడ కంచి పద్మ మాజీ వార్డ్ కౌన్సిలర్, కడ కంచి వీరస్వామి, సునీల్ శంకువర్, రాజేందర్ శంకువర్, శేఖర్ శంకువర్ , యూత్ రామ్ లాల్, విష్ణు, విశాల్, కరణ్, తదితరులు పాల్గొన్నారు



# హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదు

**: సీఎం రేవంత్ రెడ్డి**

- **అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం**
- **విద్య ద్వారానే పేదల జీవితాలు మారతాయి**
- **ఏటీసీ కేంద్రాలలో నైపుణ్య శిక్షణ అందించి మంచి ఉపాధి అవకాశాలు కల్పన**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి,రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘు రాం రెడ్డి లతో కలిసి బుధవారం పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి కి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. బెండలపాడు గ్రామంలోని పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల పైలాన్ ను ఆవిష్కరించి లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ బీజం ఖమ్మం జిల్లాలో ఏర్పడిందని, ఉద్యోగాలు, నిధులు, నీళ్ళు మాకు కావాలని ఖమ్మం ప్రజలు రాష్ట్రానికి ఒక దిక్సూచి చూపించారని సీఎం తెలిపారు. గూడెంలో పేద మహిళలు గత పది సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఆశగా ఎదురు చూశారని, గత పాలకులు వారి ఆశలను వమ్ము చేశారని అన్నారు. పేదల ఆత్మగౌరవం నిలబెట్టాలని ఆనాడు డాక్టర్ వైయస్సార్ సుదీర్ఘ పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల పథకం సాచురేషన్ పద్ధతిలో అమలు చేశారని, 10 సంవత్సరాల కాలంలో 25 లక్షల ఇండ్లు పూర్తి చేశారని అన్నారు. హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదని అన్నారు. పట్టణ ప్రాంతాలలో రాజీవ్ స్వగృహ పేరుతో ఇండ్లు అందించడం జరిగిందని అన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని కష్టపడే తత్వం ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కు హౌసింగ్ శాఖ బాధ్యతలు అప్పగించానని అన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ బాధ్యతలు కూడా వారికి అప్పగించామని అన్నారు.

నేడు లక్షలాది రైతుల భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరించడమే కాకుండా, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడంలో మంత్రి పొంగులేటి కీలక పాత్ర పోషించారని అన్నారు. నిరుపేదల కళ్ళలో ఆనందం చూస్తే చాలా సంతృప్తి ఉందని, జూబ్లీహిల్స్ లో తన ఇంటి గృహప్రవేశం నాడు ఉన్న సంతోషం కంటే నేడు పేద ప్రజల గృహప్రవేశం చూస్తుంటే ఇంకా ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం తెలిపారు. రాష్ట్రమంతా అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేస్తే, అశ్వారావుపేట లో మాత్రం 4500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేదరికం తమకు ఎక్స్కర్షన్ కాదని, జీవన విధానంలో ఒక భాగం అని, పేదరికం తరమాలని తాము కృషి చేస్తున్నామని అన్నారు. గత పాలకుల హయాంలో రేషన్ కార్డు జారీ లేదని, కనీసం కొత్త పేర్ల నమోదు కూడా చేయలేదని సీఎం విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లుఅందించామని అన్నారు. గతంలో పేదలకు దొడ్డు బియ్యం సరఫరా చేస్తే నేడు తమ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీ పంచాయతీలలో తమను లాగవద్దని, పేదలకు రేషన్ కార్డుల పంచే కార్యక్రమంలో బిజీగా ఉన్నామని సీఎం తెలిపారు. 25 లక్షలకు పైగా రైతులకు 20 వేల 600 రూపాయలతో రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేసామని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. గత 20 నెలల కాలంలో లక్షా 4 వేల కోట్ల రూపాయలు రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. 50 లక్షల పైగా పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. పేదల తలరాతను మార్చేందుకు విద్య చాలా కీలకమని, ప్రస్తుత సంవత్సరం విద్య రంగంపై 40 వేల కోట్ల వరకు ఖర్చు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. 100 నియోజకవర్గాలలో 20 వేల కోట్లు పైగా ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నామని, 40 శాతం డైట్ చార్జీలు,200 శాతం కాస్మోటిక్స్ చార్జీలను పెంచడం జరిగిందని అన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ఏర్పాటు చేసి నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. పేదలు చదువుకునేలా స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. యువత చదువు పై దృష్టి పెట్టాలని, మనం పది మందికి సహాయం చేసేటట్లు ఎదగాలని, దానికి విద్య చాలా అవసరమని అన్నారు. రాబోయే 10 రోజులలో నియోజక వర్గాల వారీగా ఎంపీలను, ఎమ్మెల్యేలను పిలిచి పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను, ఇంచార్జి మంత్రి వర్యులను ఆదేశించారు. జిల్లా ఇంచార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ గత పాలకులు పేద ప్రజలను డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసాలకు గురి చేశారని విమర్శించారు. గతంలో వైఎస్సార్ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించారని తెలిపారు. ప్రస్తుతం అదే తరహాలో మన రేవంతన్న గూడు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు పనిచేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో హామి ఇవ్వకపోయినా , గత పాలకులు అప్పు కుప్పలు చేసినప్పటికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు సంక్షేమం అందాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల ఆత్మ గౌరవాన్ని కాపాడే దిశగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని అన్నారు. మొదటి ఏడాది ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గిరిజన నియోజకవర్గాలలో అదనపు ఇండ్లు మంజూరు చేయాలని అశ్వరావుపేటకు 1000 ఇందిరమ్మ ఇండ్లను అధికంగా అందించామని, ఐటిడీఏ పరిధిలో 25 వేల ఇండ్లు, చెంచుల ఉప కులాల వారికి 13 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. 22 వేల 500 కోట్ల రూపాయలు మొదటి విడతలో ఖర్చు చేస్తూ పేదలకు ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. 2004 నుంచి 2014 మధ్య సమయంలో వైఎస్ఆర్ హయాంలో 23 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అదే విధంగా ప్రస్తుతం కూడా అర్హులైన చివరి పేద వారి వరకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మొదటి సంవత్సరం 24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా, సన్న బియ్యం సరఫరా, 7 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, 21 వేల కోట్ల రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసామని అన్నారు. ప్రజా ప్రభుత్వం బేషజాలకు పోకుండా గత పాలకులు దత్తత తీసుకున్న వాసాలమర్రి, చింతమడక గ్రామాలకు కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తుందని అన్నారు. ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, 55 లక్షల మంది పేద కుటుంబాలకు జీరో కరెంట్ బిల్లు వస్తుందని, 4 వేల కోట్ల సంవత్సరానికి ఖర్చు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 14 వేల కోట్లతో సన్న బియ్యం, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకం అమలు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వ హయాంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. అశ్వారావు పేట ఎమ్మెల్యే ఆది నారాయణ మాట్లాడుతూ నేడు ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాయని అన్నారు. చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేశామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అశ్వరావు పేట నియోజకవర్గం పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ముందు ఉందని అన్నారు. నేడు గృహ ప్రవేశం జరుపుకున్న లబ్ధిదారుల్లో ఆనందం కనపడింది అని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అనేక పోరాటాలు చేసిన ముఖ్యమంత్రి పరిపాలన వచ్చిన తర్వాత సంయమనం కొల్పోకుండా ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అర్జి పెట్టుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, పేదలకు సన్న బియ్యం సరఫరా, రైతు రుణమాఫీ,రైతు భరోసా వంటి అనేక హామీలను నెరవేర్చడం జరిగిందని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టి సాగునీటి సరఫరా పెంచాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. గిరిజనులు, ఆదివాసీలు, నిరుపేదలు సాగు చేసుకుంటున్న అడవి భూములకు పట్టాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి బస్టాండ్ మంజూరు చేయాలని, భద్రాద్రి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా మాలోతు రాందాస్ నాయక్, ఇల్లందు కోరం కనకయ్య, పినపాక పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హౌసింగ్ ఎండి. విపీ గౌతం, అదనపు కలెక్టర్ లు, మృణాల్ శ్రేష్ట, స్వయం సహాయక సంఘ సభ్యులు, ప్రజలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## టీవీఆర్ మోడల్ హై స్కూల్ లో సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన







జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీ లో గల టీవీఆర్ మోడల్ హై స్కూల్ లో కమ్యూనిటీ హెల్పర్స్ యొక్క అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో 1వ తరగతి. 2 వ తరగతి విద్యార్థిని విద్యార్థుల చే వేషధారణ వేయించి వివిధ రంగాల ఉద్యోగ బాధ్యతలు ప్రజాసేవ దేశ సేవ ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపించారు. అందుకు తగిన విధంగా తరగతి టీచర్లు బోధనా విధానంలో విభిన్న పద్ధతిలో విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారు యావత్ భారతదేశం గర్వించే విధంగా తలెత్తుకుని తిరిగే విధంగా దేశాన్ని కాపల కాసే ఆర్మీ జవాన్లను , చట్టాన్ని న్యాయాన్ని సన్మార్గంలో నడిపించే పోలీసు అధికారులను, ప్రాణాలను రక్షించే డాక్టర్లను ,సమాజ సేవ చేసే జిహెచ్ఎంసి లేబర్ కార్మికులను ,రాజకీయ వ్యక్తులను, అటెండర్ నుండి కలెక్టర్ వరకు వివిధ రంగాలలో అధికారులను వారు దేశానికి సమాజానికి చేసే సేవలను వర్ణించి , దేశానికి వెన్నుముకైనా రైతును గురించి మొదలగు వారి గురించి విద్యార్థి లోకానికి తెలిపే విధంగా టీచర్స్ తయారు చేశారు. ఈ సందర్భంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి లు విద్యార్థులను చైతన్యవంతులుగా చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పులతో పాటు సమాజానికి సేవనందించే గొప్ప వారి గురించి కూడా చిన్నారులకు వివరించడమే మా బోధన విధానంలో ప్రత్యేకత అని తెలిపారు చిన్నారులను తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్ని అభినందించారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం జయరాజ్ , అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే ముగ్గు పోసి భూమి పూజ

యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య భూమి పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. వీరారెడ్డిపల్లి గ్రామంలో 25 ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వగా 15 మంది లబ్ధిదారుల ఇళ్లకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య స్వయంగా ముగ్గు పోసి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఇచ్చిన ఇళ్లను త్వరితగతిన నిర్మాణం చేసుకోవాలని, మిగత అర్హులైన వారికి రెండవ విడత లో ఇల్లు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆర్థిక సమస్య ఉంటే మహిళా సంఘాలలో లక్ష రూపాయల వరకు సహాయం అందిస్తారని దానితో పాటు వికలాంగులకు, బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో 50 బస్తాల సిమెంట్ కూడా సహాయం చేస్తామని తెలిపారు.. అదేవిధంగా గ్రామంలో ఎవరు మొదటగా ఇల్లు నిర్మాణం చేస్తారో వారి గృహప్రవేశానికి వచ్చి పట్టుబట్టలతో పాటు యాట పొట్టేలును అందజేస్తానని బీర్ల ఐలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి మరియు మండల జిల్లా నాయకులు అధికారులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు గ్రామస్తులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలి

- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ అన్నారు. శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మాణిక్య నగర్, వీరస్వామి నగర్, సంక్షేమ సంఘం వారు, కుత్బుల్లాపూర్ గ్రామం లోని మూడుగుళ్ల దేవస్థాన కమిటీ వారు నెలకొల్పిన వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజ. కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.ఎం.ప్రతాప్ మాట్లాడుతూ బస్తీలలో, కాలనీలలో కులమతాలకు అతీతంగా, అందరూ కలిసిమెలిసి జరుపుకునే పండుగ వినాయక చవితన్నారు. శ్రీ విఘ్నేశ్వరుడు కుత్బుల్లాపూర్ నియోజక ప్రజలందరినీ చల్లగా చూడాలని వేడుకున్ననన్నారు.ఈ కార్యక్రమంలో మాణిక్య నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, వీరస్వామి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, మూడు గుళ్ళ దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి కార్మికుల సమస్యలను చెప్పుకోడానికి కూడా అవకాశం లేదా?

- **ముందస్తు అరెస్టులు చేయడమంటే కార్మిక వర్గానికి ముఖ్యమంత్రి మొఖం చాటేయడమే**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా బుధవారం కొత్తగూడెం (బెండాలపాడు) లో పర్యటన సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి నాయకులు" భూక్యా రమేష్ ను ఈరోజు ఉదయం 5 గంటల సమయంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించడం దుర్మార్గమన్నారు. దీనిని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీగా తీవ్రంగా ఖండిస్తుందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బలుగురి మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు పాలకులకు కాకుంటే వారి సమస్యలను ఎవ్వరికి చెప్పుకోవాలన్నారు. సమస్యలను తెలుసుకోని పరిష్కరించాల్సిన పాలకులే అందులో రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తుంటే ఇలా సమస్యలను వినిపించే గొంతులను అరెస్టులతో ఆపాలనుకోవడం గెలిపించిన కార్మిక వర్గాన్ని దూరం చేసుకోవడమే అవుతుం దన్నారు. ఎన్నికల సమయంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, సింగరేణి యాజమాన్యం చేసిన ఒప్పందాలను నెల రోజుల్లో అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటిన నేటికి అమలుకు చేయ్యలేని పరిస్థితి. ఉందన్నారు. దీనిపైన కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 12 న ఛలో ప్రజాభవన్ కు సైతం పిలుపు ఇవ్వడం జరిగిందనీ వారు అన్నారు .అందులో భాగంగా బుధవారం కొత్తగూడెం (బెండాల పాడుకు) వస్తున్న ముఖ్యమంత్రి కి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీ గుర్తుచేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఇలా జెఎసి నాయకులను ముందస్తు అరెస్టులు చేయించడం దుర్మార్గమని విమర్శించారు. మా ప్రభుత్వం ప్రజా పాలన అంటున్నే ఇలా అక్రమ అరెస్టులు చేయించడం ప్రజాపాలన అర్థాన్నే మార్చడమే అవుతుందనీ పేర్కొన్నారు .వెంటనే అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రి ని కలిసే అవకాశం కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు..

# ఐజేయు టీయుడబ్ల్యుజే లో కుత్బుల్లాపూర్ నుంచి భారీ చేరికలు

* **కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో టియుడబ్ల్యుజే (ఐజేయు) యూనియన్ సభ్యత్వ నమోదు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వివిధ జర్నలిస్ట్ యూనియన్ ల నుండి ఐజేయు టియుడబ్ల్యుజే లో కుత్బుల్లాపూర్ నుంచి భారీగా చేరారు. మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్, దయాకర్ రెడ్డి , కుత్బుల్లాపూర్ టీయూడబ్ల్యూజే యూనియన్ సెక్రటరీ సాయిబాబా ఆధ్వర్యంలో తమ తమ సభ్యత్వాలను తీసుకున్నారు. ఐజేయు టీయూడబ్ల్యూజే యూనియన్ లో ప్రభాకర్ రెడ్డి,ఈటీవీ సంతోష్ యాదవ్, టీ న్యూస్ జనార్ధన్ రెడ్డి,వి6 సంతోష్ రెడ్డి, ఎన్టీవీ సూర్య నారాయణ రెడ్డి, బిగ్ టీవీ రవీందర్ రెడ్డి, ఏబీఎన్ రాజు రెడ్డి, ఐ న్యూస్ భాస్కర్ రెడ్డి, టీవీ5 ప్రవీణ్, టెన్ టీవీ ప్రవీణ్, నరేందర్ ,హెచ్ఎంటీవి శ్రీధర్,ఏబీవీపీ నవీన్, బి ఆర్ కే న్యూస్ సతీష్, 99 టీవీ రవి, వి ఫైవ్ రాజేష్, కలికి మూర్తి, దత్తు, సైదులు,యండి.లియాఖత్ ఆలీ, రాము, నవీన్ రాజు, రవి కుమార్, రాజేశ్వర్, నాగబాబు, మల్లేశం, రాజశేఖర్ యాదవ్, క్రిష్ణ, వజీర్ మహమ్మద్, సత్యనారాయణ, తదితరులు సభ్యత్వం తీసుకున్నారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## కేరళ అమ్మాయి.. అమెరికా అబ్బాయి.. ఫ్రాన్స్ కలిపింది ఇద్దరిని!



ఎర్నాకుళం: అమ్మాయిది కేరళ. అబ్బాయిది అమెరికా. ఇద్దరికి ఫ్రాన్స్‌లో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలోనే ఖండాలు దాటొచ్చిన అతడు.. ఇటీవల కొచ్చిలో ఆమెను వివాహమాడాడు. ఓనం పండగ ఆనందాన్ని రెట్టింపు చేశాడు. ఫోర్ట్ కొచ్చికి చెందిన అంజలి మూడేళ్ల క్రితం ఫ్రాన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో.. అమెరికాకు చెందిన రాబర్ట్ వెల్స్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మనసులు కలిశాయి. ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లికి సిద్ధమయ్యారు. ఓనం పండగ వేళ అంజలి స్వస్థలానికి వచ్చిన రాబర్ట్.. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నాడు. స్వయంగా అందరికి మిఠాయిలు పంచిపెట్టాడు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ" చే పోలయ్య కవికి ఘన సన్మానం




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాద్ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాకవి శ్రీ దాశరధి కృష్ణమాచార్య "శతజయంతి" ఉత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ" ,సర్వేజనా సుఖినోభవంతు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మందాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన శతాధిక కవుల ఘన సన్మాన మహోత్సవ సభ జరిగింది. ఈ సభలో దాదాపుగా 4000 కవితలు వ్రాసిన హైదరాబాద్ అత్తాపూర్ నివాసి ప్రముఖ కవి రచయిత పోలయ్య కవి కూకట్ పల్లిని వారు చేస్తున్న గొప్ప సాహితీ సేవకు గుర్తింపుగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా లయన్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ 320ఏ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ ప్రెసిడెంట్ లయన్ డా.ఇఎస్ సూర్య నారాయణ లు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత పోలయ్య కవి కూకట్ పల్లి మాట్లాడుతూ తాను సామాజిక అంశాలు, మానవతా సంబంధాలే, ఇతివృత్తాలుగా దాదాపుగా 4000 కవితలు రాసినందుకు...వ్రాసిన కవితలన్నీ 70 దిన, వార, మాస డిజిటల్ పత్రికల్లో ప్రచురితమైనాయ్యన్నారు.



## మద్యం కేసు.. వైకాపా నేతల ఇళ్లు, కంపెనీల్లో సిట్ తనిఖీలు

చిత్తూరు: ఏపీ మద్యం కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. వైకాపా నేత విజయానందరెడ్డి ఇళ్లు, కంపెనీల్లో సిట్ తనిఖీలు చేస్తోంది. చిత్తూరు బీవీరెడ్డి కాలనీలో, నలందానగర్‌లోని నిఖిలానంద అపార్టుమెంట్‌లో అధికారులు సోదాలు చేస్తున్నారు. విజయానందరెడ్డి 2024లో వైకాపా తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆయన్ను రెండ్రోజుల క్రితం విజయవాడ సిట్ కార్యాలయానికి పిలిచి విచారించారు. విజయానందరెడ్డి ఇంటి అడ్రస్సుతో సీబీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ ఉండటంపై అధికారులు ఆరా తీస్తున్నారు. వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సంబంధించి హైదరాబాద్‌లోనూ సిట్ తనిఖీలు సాగుతున్నాయి. తిరుపతిలో ఆయనకు చెందిన రియల్ ఎస్టేట్ కార్యాలయంలో, తిరుపతి గ్రామీణ మండలంలోని ఇంట్లో అధికారులు సోదాలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా చేసిన నారాయణ స్వామి ఇంట్లోనూ కొద్ది రోజుల క్రితం అధికారులు తనిఖీలు చేశారు.

## తిరుమలలో భక్తులకు మోసం.. సీరియస్ వార్నింగ్ ఇచ్చిన టీటీడీ



శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ అధికారులు హెచ్చరించారు. భక్తురాలు ఊర్వశి ఇచ్చిన ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం స్పందించారు. ఇటీవల టీటీడీ సేవల పేరుతో నకిలీ వెబ్ సైట్లు ద్వారా మోసం చేస్తున్న ఘటనలు అధికమయ్యాయని, భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమాస్పద వ్యక్తులు, దళారులు ప్రలోభ పెడితే ముందుగా 0877 - 2263828కు ఫోన్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. నకిలీ దర్శన టికెట్లు, వసతి పేరుతో దందా చేస్తే వెంటనే సదరు మోసపూరిత వ్యక్తులు, దళారుల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాగా భక్తురాలు ఊర్వశి.. గూగుల్ ద్వారా వసతి కోసం వెతికే క్రమంలో శ్రీనివాసం రెస్ట్ హౌసెస్ అనే వెబ్ సైట్‌లో ఇచ్చిన మొబైల్ నెంబర్ 8,06,21,80,322ను సంప్రదించారు. ఆ తర్వాత అభిమన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్‌లో రిసెప్షన్‌కి చెందిన వాడినని పరిచయం చేసుకున్నారు. సదరు భక్తురాలికి వసతి కల్పిస్తామని డబ్బులు వసూలు చేశారు. డబ్బు చెల్లిస్తే వసతి టికెట్‌ను పీడీఎఫ్ పంపిస్తామని చెప్పారు. డబ్బు తీసుకున్న తర్వాత సదరు నిందితుడు తన ఫోన్ కాల్స్ , వాట్సాప్ మేసేజ్‌లకు స్పందించకుండా మోసం చేశారు. దీంతో నకిలీ వెబ్ సైట్ ద్వారా మోసపోయానని గ్రహించిన సదరు భక్తురాలు 1930 క్రైమ్ హెల్ప్ లైన్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## లిక్కర్ కేసులో సిట్ దూకుడు.. చెవిరెడ్డి ఇన్‌ఫ్రా కంపెనీల్లో సోదాలు



రాష్ట్ర లిక్కర్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. వైసీపీ నేత చెవిరెడ్డి రెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డికి చెందిన ఇన్ ఫ్రా కంపెనీల్లో సోదాలు నిర్వహించారు. అధికారులు చిత్తూరు వెళ్లి ఆయా కంపెనీల్లో తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే పలు రికార్డులను పరిశీలిస్తున్నారు. మద్యం ముడుపులను కంపెనీల్లోకి మళ్లించినట్లుగా అధికారులకు సమాచారం అందడంతో ఈ సోదాలు చేపట్టారు. దీంతో ఆయా కంపెనీల్లో అధికారుల తనిఖీలు ఒక్కసారిగా కలకలం రేపాయి. సమాచారం తెలుసుకున్న చిత్తూరు వైసీపీ శ్రేణులు ఆయా కంపెనీల వద్దకు భారీగా చేరుకుంటున్నారు. సిట్ చర్యలను వ్యతిరేకిస్తున్నారు. సిట్ ను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. సోదాల తర్వాత ఏం జరుగుతుందో చూడాలి.

## దారి చూపిన దీపం పొట్టి శ్రీరాములు.. మంత్రి నారా లోకేశ్

* **అమరజీవి త్యాగం.. అజరామరం**
* **దారి చూపిన దీపం పొట్టి శ్రీరాములు**
* **ఆయన ఫాదర్‌ఆఫ్‌లింగ్విస్టిక్స్ స్టేట్స్**
* **అమరావతిలో ఆయన స్మృతివనం ఏర్పాటు**
* **రోశయ్య రాజకీయాల్లో లేని లోటు తెలుస్తుంది..**
* **శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్**



అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిది అని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. అమరావతిలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం, స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల ఒక్క ఆంధ్ర రాష్ట్రమే కాదు, దక్షిణాదిలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని అన్నారు. ఆ ఆయన ఆమరణ నిరాహార దీక్ష వలన దేశ రాజకీయాల్లోనే పెను మా ర్పులు వచ్చాయన్నారు. మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధిస్తే.. పొట్టి శ్రీరాములు తెలుగుజాతి కోసం ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. గాంధీ ఫాదర్ ఆఫ్ నేషన్ అయితే.. పొట్టి శ్రీరాములు ఫాదర్ ఆఫ్ లింగ్విస్టిక్స్ స్టేట్స్ అని పిలుస్తారని తెలిపారు. కొన్ని దీపాలు వెలుతురిని ఇస్తాయి.. మరికొన్ని దీపాలు దారిని చూపిస్తాయని లోకేష్ అన్నారు. ప్రాణత్యాగం చేసి కోట్లాది మందికి దారి చూపించిన దీపం పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. 58 రోజులపాటు ఆయన చేసిన దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని అమరావతి రాజధానిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దళితులను గుడిలోకి ప్రవేశించాలని పొట్టి శ్రీరాములు పోరాడారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు వంటి వ్యక్తి పదిమంది ఉంటే భారతదేశానికి స్వాతంత్రం ఒక్క ఏడాదిలో వస్తుందని ఆనాడు గాంధీ చెప్పారని అన్నారు. ఆయన జీవితం నుంచి చాలా నేర్చుకోవాలని పేర్కొన్నారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన పోరాడే అని తెలిపారు. పొట్టి శ్రీరాములు నుంచి పట్టుదలను నేర్చుకోవాలన్నారు. ఏదైనా సాధించాలని పట్టుదలతో తొలి అడుగు వేస్తే సమాజం మొత్తం మన వెనుక వస్తుందని అన్నారు. ఎన్ని దశాబ్దాలు అయినా ఆయనను ఈరోజు గుర్తు చేసుకుంటున్నామంటే ఆయన చేసిన త్యాగమే అని అని తెలిపారు. మాజీ సీఎం దివంగత రోశయ్యను కూడా లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఆయన గవర్నర్ అయిన తర్వాత ఏడాదికి ఒకసారి అయినా మాట్లాడే వాడిని గుర్తు చేశారు. మీరు రాజకీయాల్లో లేని లోటు తెలుస్తుందని ఆయనతో తాను చెప్పానని అన్నారు. మిమ్మల్ని చూసి పెరిగినవాడిని.. మీరు ఎలా అసెంబ్లీలో పోరాడారో చూశానన్నారు. రాజశేఖర్రెడ్డికి.. చంద్రబాబు నాయుడుకి మధ్య యుద్ధం జరుగుతుంటే.. ఒక్క మాటతో దానిని చల్లబరిచే వారిని ఆయన గుర్తు చేశారు. ఇలా రాష్ట్రం కోసం పనిచేసిన వారందరినీ మనం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పొట్టి శ్రీరాములు స్మృతివనం కట్టడమే కాదు.. ఒక రీసెర్చ్ చైర్మన్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పొట్టి శ్రీరాములు చరిత్రపై పరిశోధన జరగాలని లోకేశ్ ఆకాంక్షించారు.

## అమరావతిపై దుష్ప్రచారం

### : మంత్రి నారాయణ స్ట్రాంగ్ వార్నింగ్




మూడేళ్లలో అమరావతిని రెడీ చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. గుంటూరులో పర్యటించిన ఆయన.. అమరావతి చాలా సేఫ్ సిటీ అని తెలిపారు. అమరావతి నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రతి రోజూ డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్నాయని, ఆ విషయం వచ్చి చూస్తూ తెలుస్తుందన్నారు. రాజధానిపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిని గ్రాఫిక్స్ ప్రజలు క్షమించరని నారాయణ హెచ్చరించారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి రాజధానిపై దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అమరావతి నిర్మాణ పనులను శరవేగంగా చేస్తోంది. ఇప్పటికే పలు బిల్డింగులు పూర్తి దశకు చేరుకున్నాయి. మరి కొన్ని నిర్మాణం దశలో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే రాజధానికి ఓ రూపు ఏర్పడుతోంది. ఈ సమయంలో కొందరు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారు. దీంతో మంత్రి నారాయణ స్పందించి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## గడ్కరీ చెప్పిన విషయానికి చంద్రబాబు ఆశ్చర్యపోయారు




రైస్ నుంచి తారు విటమిన్ తయారుకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విషయాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా చెబితే సీఎం చంద్రబాబు ఆశ్చర్య వ్యక్తం చేశారని రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్ తెలిపారు. అంతేకాదు ఆ దిశగా ఆలోచన చేస్తామని చంద్రబాబు చెప్పారని ఆయన గుర్తు చేశారు. పామాయిల్, కోకో, కొబ్బరి రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఏలూరు నిమ్మ మార్కెట్‌కి ప్రసిద్ధి అని, అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమలకు కేంద్రం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు చేసిన యువత నిరుద్యోగులుగా మారడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. అందుకే కేంద్రం స్కిల్ యూనివర్సిటీలను తీసుకుని వచ్చిందన్నారు. ప్రధానమంత్రి కౌశల్య యోజన పేరుతో 18 వృత్తులు కు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా యువతకు అవకాశాలు వస్తాయని తెలిపారు. ఇందు కోసం విశాఖలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన విద్యా విధానంతో ఆదిలోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని ఛాయ్ పే చర్చలో వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తితో సారథ్యం యాత్ర చేస్తున్నట్లు మాధవ్ స్పష్టం చేశారు.

# చిన్నమొత్తమే రూ.కోట్ల నిధిగా మారుతుంది: పీఎఫ్ఆర్‌డీఏ ఈడీ మమత రోహిత్

హైదరాబాద్: దేశంలో 2047 నాటికి కార్మిక బలగం, అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని పీఎఫ్ఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మమత రోహిత్ తెలిపారు. ప్రస్తుతం అటల్ పింఛను యోజన, ఎన్‌పీఎస్ కింద 8 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని, రూ.15.56లక్షల కోట్ల ఆస్తులున్నాయని పేర్కొన్నారు. దేశంలో 46 కోట్ల మంది కార్మిక బలగం ఉంటే.. 17 కోట్ల మందికి మాత్రమే పింఛను ప్రయోజనాలు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ కార్మికులు, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు, మహిళలను, పిల్లలను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చి భవిష్యత్తుకు మార్గం వేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ రైతులు, కార్మికులకు మరింత అవగాహన కల్పించి, ఈ పథకంలో చేర్చేందుకు ప్రైవేటు సంస్థలు, సొసైటీలు, సంఘాల భాగస్వామ్యం తీసుకోనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయదారులు, మహిళల కోసం మరిన్ని పథకాలు తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ జరూరీపై (విత్తన పొదుపు పింఛను పంట), ఎన్‌పీఎస్ వాత్సల్య (పిల్లల భవిష్యత్తు కోసం) పథకాలపై 'ఈనాడు'తో మమత రోహిత్ మాట్లాడారు. ఎన్‌పీఎస్‌లో ఇప్పటికే పాక్షిక ఉపసంహరణలకు అవకాశముంది. లాకిన్ పీరియడ్ తరువాత అత్యవసరాలైన వైద్యసేవలు, విద్య, పిల్లల వివాహాలు, గృహాలు కొనుగోలు చేసేందుకు మూడుసార్లు కలిపి 25శాతం వరకు జమను ఉపసంహరించుకోవచ్చు. అవసరాల ఆధారంగా నిబంధనలు మార్చే అవకాశం ఉంది. అయితే



ఇప్పటివరకు ఉపసంహరణ పరిమితి పెంచాలన్న డిమాండ్లు లేవు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లు అనుకుంటాం. కానీ చాలా మంది 60 ఏళ్లు దాటిన తరువాత కూడా పనిచేస్తున్నారు. అందుకే ఈ పథకంలో చేరే వయసును 70 ఏళ్ల వరకు పెంచాం. గతంలో 60 ఏళ్లు నిండగానే ఎన్‌పీఎస్ కార్పస్ నుంచి 60 శాతం ఏకమొత్తంగా ఉపసంహరించుకోవాలని, 40శాతం కార్పస్‌ను యాన్యుటీలో పెట్టాలన్న నిబంధన ఉండేది. ఇప్పుడు 75 ఏళ్ల వరకు ఏకమొత్తం, యాన్యుటీ అవకాశాన్ని పొడిగించుకునే అవకాశమిచ్చాం. తద్వారా 75 ఏళ్ల తరువాత ఉపసంహరించుకునే అవకాశం ఉంటోంది. అంటే అప్పటి వరకు పీఎఫ్ఆర్‌డీఏ వద్ద కార్పస్ నిల్వలు ఉండటంతో దానిపై వచ్చే రిటర్ను లబ్ధికూడా పెరుగుతోంది. ఆ తరువాత నెలవారీ పింఛనుకు అవసరమైన ప్రణాళిక చేయవచ్చు. సిస్టమెటిక్ విత్‌డ్రాయల్ ఆప్షన్ (ఎస్‌డబ్ల్యూపీ) కూడా పొందుపరిచాం. ఎన్‌పీఎస్ నిధి నిర్వహణలో నూరుశాతం పారదర్శకత పాటిస్తున్నాం. 16 రెగ్యులేషన్స్ ఉన్నాయి. దగ్గర నుంచి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. అసంఘటిత రంగంలోని కార్మికులను ఎన్‌పీఎస్ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరముంది. ఇప్పటికే పీఎఫ్ఆర్‌డీఏ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఆ రంగాన్ని చేరువ చేసుకోవాల్సిన అవసరముంది. కొత్తగా ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్య పథకంలో పుట్టిన వెంటనే ఖాతా తెరిచే అవకాశముంది. పీఎఫ్ లెక్కింపు క్యాలిక్యులేటర్, రిటర్నులు పరిశీలిస్తే పుట్టినప్పటి నుంచి ఖాతాలో వేసే చిన్నపాటి మొత్తం.. 75 ఏళ్ల నాటికి కోట్లాది రూపాయల కార్పస్ అవుతుంది. యువత పింఛను పథకాలను సరిగా అర్థం చేసుకోవడం లేదు. పింఛను అనేది పెద్ద ప్రణాళిక అని, దీర్ఘకాలం నిధి లాక్ అవుతుందని భావిస్తున్నారు. సత్వర అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. వారందరికీ పింఛను ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్నాం. యువతను పెద్దఎత్తున ఎన్‌పీఎస్‌లో చేర్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం అని తెలిపారు.



## హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం.. ఈ నెల 6న సెలవు

హైదరాబాద్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 6న (శనివారం) సెలవు ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెలవు ఇస్తున్నట్లు తెలిపింది. అక్టోబర్ 11న రెండో శనివారం పనిదినంగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 6న హైదరాబాద్‌లో జరగనున్న నిమజ్జనానికి జీహెచ్ఎంసీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఆరోజున సుమారు 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

## హైదరాబాద్‌లో గణేశ నిమజ్జనం.. హాజరు కానున్న కేంద్ర హోం మంత్రి

హైదరాబాద్: గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీకానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి.. కమిటీ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం 4 గంటలకు మెజాంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుని గణనాథులకు స్వాగతం పలకడంతో పాటు గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారని భాజపా వర్గాలు తెలిపాయి.

## పార్టీలో ఉన్నప్పుడు వాళ్ల అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?

**: కవితకు రఘునందన్ ప్రశ్న**

హైదరాబాద్: రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నేడు ప్రెస్‌మీట్‌లో కవిత కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు. "జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో భారత రాష్ట్ర సమితి అవినీతి పునాదుల మీద విస్తరించబడిందని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో భారత రాష్ట్ర సమితి పెద్దలు చేసిన అవినీతిని బయటపెడితే బాగుంటుంది. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల మీద మీరు పార్టీలో, ప్రభుత్వంలో



ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు" అని రఘునందన్‌రావు కవితను ప్రశ్నించారు.

## నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

ఉట్కూరు: ఆడుకుంటూ వెళ్లి ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండాలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లి తండాకి చెందిన పునియ నాయక్, జయమ్మ దంపతులకు అభి(5), ఆకాశ్(4) కుమారులున్నారు. గత కొన్నాళ్లుగా వీరు హైదరాబాద్‌లో నివాసముంటూ తమ గ్రామంలో నిర్వహించే గణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణలోని నిర్మాణ పనులు కోసం ఏర్పాటు చేసుకున్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడిపోయారు. ఎవరూ గమనిచకపోవడంతో గుంతలోనే మృత్యువాత పడ్డారు. కొంత సమయం తర్వాత జయమ్మ పిల్లల కోసం వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. ఆ ప్రాంతంలో ఉన్నవారు గమనించి



కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చిన్నారులను జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు

## ఖైరతాబాద్‌లో భక్తుల రద్దీ.. మహా గణపతి దర్శనానికి 3 గంటలు

**హైదరాబాద్: ఖైరతాబాద్‌లో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. 8వ రోజు విశ్వరూప మహాగణపతి దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బడా గణేష్‌ను దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తున్నారు. దీంతో లక్డీకాపూల్, ట్యాంక్‌బండ్, సచివాలయం మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వారం రోజుల్లో దాదాపు 12 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.**







## కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం

**: మహేశ్ కుమార్ గౌడ్**



హైదరాబాద్: కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకొని ఇప్పుడు తిట్టుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత చెప్పిన విషయాలన్నీ వాస్తవమేనని, రాష్ట్రంలో పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందన్నారు. "పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు. వాళ్ల పార్టీ లేకుండా వారే చేసుకుంటున్నారు. కవిత ఇన్ని రోజులు బాణాన్ని కేటీఆర్ మీదకు ఎక్కుపెట్టారు. అకస్మాత్తుగా ఆ బాణాన్ని హరీశ్‌రావు మీదకు తిప్పారు. అమెరికా వెళ్లి వచ్చాక కవిత వైఖరిలో మార్పు కనిపించింది. కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం. కేసీఆర్ కుటుంబంలో ఇది కొత్త నాటకం" అని అన్నారు.

## విధుల్లో చేరిన లెఫ్టినెంట్ జనరల్ హార్పల్ సింగ్

రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమితులైన లెఫ్టినెంట్ జనరల్ కల్నల్ హార్పల్ సింగ్ సోమవారం విధుల్లో చేరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిచేసేందుకు రూపొందించిన ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణ నిమిత్తం సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు హార్పల్‌సింగ్ మంత్రి ఉత్తమ్‌తోపాటు నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్‌తోపాటు ఈఎన్సీలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు.



## కాంగ్రెస్, భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి

**: కేటీఆర్**

ఎర్రవల్లి: కాంగ్రెస్ 21 నెలల పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎర్రవల్లిలో మీడియాతో ఆయన మాట్లాడారు. "ప్రతి రైతూ అప్పటి రోజులే బాగుండేవని అంటున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా హుస్సేన్‌సాగర్ వంటివి రోజుకు రెండు నింపొచ్చు. ఆ ప్రయత్నమే కేసీఆర్ చేశారు. అంతటి గొప్ప కాళేశ్వరం కట్టిన కేసీఆర్‌పై సీబీఐ కేసులు పెడుతున్నారు. సీబీఐ అనేది భాజపా జేబు సంస్థ అని రాహుల్‌గాంధీ రోజూ అంటున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి" అని కేటీఆర్ విమర్శించారు.



# గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో నిశాంఛి




**టాకీస్:** బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'నిశాంఛి' జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఆయిశ్వర్య థాకరే హీరోగా బాలీవుడ్‌కి పరిచయం అవుతుండగా, వేదిక పింటో, మోనికా పన్వార్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్ , కుముద్ మిశ్రా(ఔషపష ఃరసశ) కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.

## 'కూలీ' నటుడిపై చీటింగ్ కేసు..

### షాబిన్ షాహిర్‌కి షాకిచ్చిన ఎర్నాకులం కోర్టు

**టాకీస్:** మలయాళం నటుడు కూలీ సినిమా ఫేం షౌబిన్ షాహిర్‌పై ఎర్నాకులంలో చీటింగ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. 'మంజుమ్మల్ బాయ్స్' సినిమా విషయంలో ఈ కేసు నమోదు అయ్యింది. మంజుమ్మల్ బాయ్స్ సినిమాకు షౌబిన్ షాహిర్‌తో పాటు అతడి తండ్రి, మరొకరు నిర్మాతగా వ్యవహరించారు. అయితే ఈ సినిమాకి సిరాజ్ అనే వ్యక్తి రూ. 7 కోట్ల వరకు పెట్టుబడిని పెట్టాడు. సినిమా విడుదలయ్యాకా లాభాల్లో 40 శాతం వాటా ఇస్తామని నిర్మాతలు హామీ ఇచ్చారని సిరాజ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే,



సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయినప్పటికీ, తనకు ఇంకా వాటా ఇవ్వలేదని.. షౌబిన్ షాహిర్‌తో పాటు అతడి తండ్రి తనను మోసం చేశారని సిరాజ్ ఆరోపించాడు. దీంతో పోలీసులు షౌబిన్‌తో పాటు ఇతరులపై కేసు నమోదు చేశారు.

ఈ కేసులో షౌబిన్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినప్పటికీ ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. అయితే ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 5, 6 తేదీల్లో దుబాయ్‌లో జరగనున్న సైమా అవార్డ్స్ వేడుకకు అటెండ్ అవ్వడం కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని షౌబిన్ కోర్టును అభ్యర్థించగా.. ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసు ఇంకా విచారణ దశలో ఉందని.. కేసుకి సంబంధించి ఒక కీలక సాక్షి దుబాయ్‌లో ఉన్నారని షౌబిన్ విదేశాలకు వెళ్తే విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రాసిక్యూషన్ వాదించడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక కోర్టు అనుమతి నిరాకరించడంతో షౌబిన్ షాహిర్ దుబాయ్ పర్యటన ముగిసినట్లు తెలుస్తుంది.



# ప్రపంచానికి కెన్యా ప్రకృతి దృశ్యాలు

### రాజమౌళి సినిమాపై ఆ దేశ మంత్రి వ్యాఖ్య



**టాకీస్:** మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి29' (వర్కింగ్ - టైటిల్). భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అదే స్థాయిలో విడుదల చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేశారు. కెన్యాలో షూటింగ్ చేస్తున్న సందర్భంగా.. ఆ దేశ మంత్రి ముసాలియా ముదావాదిని మూవీ టీమ్ మర్యాదపూర్వకంగా కలిసింది. భేటీ అనంతరం ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో అక్కడి మంత్రి పోస్టు చేశారు. రెండు దశాబ్దాలుగా రాజమౌళి సినీ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. చాలా శక్తిమంతమైన కథనాలను, విజువల్స్‌ను, లోతైన సాంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. తూర్పు ఆఫ్రికా అంతటా పర్యటించిన అనంతరం 120 మందితో కూడిన రాజమౌళి టీమ్ కెన్యాను ఎంచుకుంది. మసాయి మరా మైదానాల నుంచి అంబోసెలి వంటి ప్రాంతాలు ఆసియాలోనే అతిపెద్ద చలనచిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో భాగం కాబోతున్నాయి. 120 దేశాల్లో ఈ మూవీని విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికిపైనే చేరువయ్యే అవకాశం ఉంది. కెన్యాలో షూటింగ్ చేయడం ఒకమైలురాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ వేదికపై మా దేశ అందాలను, ఆతిథ్యాన్ని, సుందర దృశ్యాలను చూపడంలో ఈ సినిమా శక్తిమంతంగా పనిచేయనుంది. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రంతో కెన్యా తన చరిత్రను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో గర్వంగా ఉంది అని ముసాలియా ముదావాది పేర్కొన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు-, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నట్లు- ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంతో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.



# మళ్లీ నటించాలనే ఉంది

### గోవా బ్యూటీ ఇలియానా

టాకీస్: గోవా బ్యూటీ- ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి... ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

# అనుకున్న సన్నివేశాలు మిస్ అయ్యాం

### హరిహరవీరమల్లుపై దర్శకుడు క్రిష్

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పాన్-ఇండియా సినిమాగా వచ్చిన హరి హర వీర మల్లు బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా కలెక్షన్లను రాబట్టలేక పోయింది. కేవలం కలెక్షన్స్ పరంగా మాత్రమే కాకుండా కంటెంట్ కూడా ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం రీచ్ కాలేదని టాక్. ఈ సినిమాకు మొదట దర్శకుడిగా ఉన్న క్రిష్ జాగర్లమూడి సినిమా మధ్యలో తప్పుకోవడంతో, తర్వాత సినిమా దర్శక బాధ్యతలు



జ్యోతి కృష్ణకి చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఘాటి సినిమా ప్రమోషన్స్ సందర్భంగా దర్శకుడు క్రిష్ హరి హర వీర మల్లులోని కొన్ని కీలక విషయాలను బయటపెట్టాడు. ఆయన చెప్పినదాని ప్రకారం.. తాను తెరకెక్కించిన ఎక్కువ సన్నివేశాలు ఢిల్లీ దర్బార్ నేపథ్యంలోనే జరుగుతాయి. అందుకోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకంగా ఒక అద్భుతమైన సెట్ వేసి వాటిని తీశాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఒక ఛాండెలియర్‌పై జరిగే ఫైట్ సీక్వెన్స్ లో అద్భుతంగా యాక్ట్ చేశారు. కానీ, ఈ ఎపిసోడ్ కథ ఢిల్లీకి వెళ్లిన తర్వాత వస్తుంది. ఇందుకు సంబంధించి దాదాపు 40 నిమిషాల ఫుటేజ్ సెకండ్ పార్ట్ కోసం ఉంచామని తెలిపారు.అలాగే పవన్ కళ్యాణ్ స్వయంగా ఫైట్స్‌లో పాల్గొని అద్భుతంగా పని చేశారన్నారు. ఆయన ఔరంగజేబ్ దర్బార్‌కి వెళ్లి సూటిగా సవాల్ చేస్తారని, మొఘల్ చక్రవర్తి కోసం ప్రత్యేకంగా చేసిన సింహాసనంపై కూర్చొని, అక్కడి నుండి కోహినూర్ వజ్రం దొంగిలించే సన్నివేశం ఉందంటూ సినిమా విశేషాలను రివీల్ చేశారు. ఇలాంటి ఎన్నో మంచి సన్నివేశాల ఫుటేజ్ ఇంకా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉందని ఆయన అన్నారు. నేను పవన్ కళ్యాణ్ పై నా ప్రేమను ఈ సినిమాతో చూపించాను అని క్రిష్ వెల్లడించారు.

# సుదీప్....మార్క్ సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల

**టాకీస్:** కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి 'మార్క్' టైటిల్ ఖరారు చేశారు. సినిమా -టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మార్క్' చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మార్క్' సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.మార్క్' సినిమా -టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ్, ఆటిట్యూడ్, రూత్ లెస్, కింగ్...అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్ లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్ ను ఇం-టె-న్స్ లుక్ లో పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే -టైటిల్ 'మార్క్' ఉండబోతోంది. ఈ గ్లింప్స్ కు అజనీష్ లోకనాథ్ అందించిన బీజీఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ -టైనర్ గా రూపొందుతున్న 'మార్క్' సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.